నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, శుక్రవారం 9 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

# ఎటుచూసినా నిరసన జ్వాలలు!

- సర్కారు హామీలు నెరవేరక రోడ్డెక్కుతున్న జనం
- ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, నిలదీతలు..
- పనుల్లేక, పథకాలు అందక నిరుపేదల గగ్గోలు
- యాసంగి ధాన్యం కొనుగోళ్లలోనూ అంతా డొల్ల
- ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపికలోనూ అదేతంతు
- నిరసనలు చేపట్టినా తాగునీరు ఇవ్వని నిర్లక్ష్యం
- కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై భగ్గుమంటున్న నిరుపేదలు

## కడుపుమండి తిరుగుబాటు చేస్తున్న కడు పేదలు?

భద్రాద్రి కొత్తగూడెం, మే 8 (నమస్తే తెలంగాణ) : అలవిగానీ హామీలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్.. వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తోంది. అరకొరగా ఇస్తున్న కొన్ని పథకాలను పూర్తిగా అనర్హులకే కట్టబెడుతోంది. దీంతో కడుపుమండిన కడు పేదలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడుతున్నారు. దీంతో ఇటీవల ఎక్కడ చూసినా ఆందోళనలే కన్పిస్తున్నాయి. నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఒక్కరో ఇద్దరో కాదు.. దాదాపు అన్ని వర్గాల ప్రజలూ అన్ని గ్రామాల్లోనూ తమ తమ సమస్యల పరిష్కారం కోసం, తమకిచ్చిన హామీల అమలు కోసం రోడ్డెక్కుతున్నారు. తమకు న్యాయం చేయాలని, పథకాలను వర్తింపజేయాలని డిమాండ్లు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, సకాలంలో వేతనాల కోసం కొన్ని చోట్ల, ధాన్యం కొనుగోళ్లు, నిధుల జమ కోసం మరి కొన్నిచోట్ల, ఉపాధి పనులు, తాగునీళ్ల తదితరాల కోసం ఇంకొన్ని చోట్ల.. ఆందోళనపర్వాలే సాక్షాత్కరిస్తున్నాయి. గడిచిన నెల రోజులుగా భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా నిరసనలు జరగని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. ఏదైనా ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే అన్ని వర్గాల ప్రజల నుంచి ఇంతటి వ్యతిరేకతను మూటగట్టుకోవడం ముసుపెన్నడూ చూడని విశేషం.

'ఎక్కడికెళ్లినా అప్పు పుట్టడం లేదు. నన్ను నిలువునా చీల్చినా ఆర్థికపరమైన హామీలు నెరవేర్చలేను' అంటూ ప్రభుత్వ ఉద్యోగులనుద్దేశించి ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాడెత్తేసిన విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కానీ.. అదే కాంగ్రెస్ నేతలు.. 16 నెలల క్రితం ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలంటూ ఎడాపెడా హామీలిచ్చారు. ఇప్పుడేమో వాటిని అమలు చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. కానీ.. అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి కాంగ్రెస్ పాలకులు తమ అచేతనాన్ని చాటుకుంటూనే ఉన్నారు. అసంపూర్తి రుణమాఫీ, రైతు భరోసాలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా ఉన్నాయి. ఇటీవల మొదలైన ఇందిరమ్మ ఇండ్లు, ధాన్యం కొనుగోళ్లు, బోనస్, రేషన్ కార్డుల వంటివి మరింత స్పష్టతనిస్తున్నాయి.

బూర్గంపహాడ్ మండలం మోతే గ్రామంలో ఉపాధిహామీ పనులు కల్పించాలంటూ రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న కూలీలు(ఫైల్)

అశ్వారావుపేట మండలం గాండ్లగూడెంలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వలేదంటూ సర్వే అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు(ఫైల్)

### అన్నింటా బొక్కబోర్లా..

హామీ ఇచ్చిన ఏ ఒక్క పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయలేకపోతుండడం, కొద్దోగొప్పో అమలు చేస్తున్న పథకాల్లో అనర్హులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అగ్రతాంబూలం వేస్తుండడం వంటి కారణాలతో ఈ ప్రభుత్వంపై నిరుపేదలు భగ్గుమంటున్నారు. రోడ్డెక్కి రాస్తారోకోలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు రాక, ధాన్యం కొనుగోలు చేయక, అక్కడ సౌకర్యాలు సమకూర్చక, గన్నీ బ్యాగులు సిద్ధం చేయక, తరుగులో న్యాయం చేయక, ఉపాధిహామీ పనులు కల్పించక, తాగునీరు సరఫరా చేయక, రేషన్ కార్డుల్లో పేర్లు ఎక్కించక, కొత్త కార్డులు ఇవ్వక, వేతనాలు పెంచక, పెంచిన వేతనాలూ ఇవ్వక సర్కారు ధోకా చేస్తుండడంపై ఆయా వర్గాల ప్రజలు భగ్గుమంటున్నారు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. నిరసనలు చేపడుతున్నారు.

### ఎక్కడ చూసినా నిరసనలే..

చుంచుపల్లి మండలం పెనుబల్లిలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదంటూ అక్కడి అర్హులు ఇటీవల ఆందోళనకు దిగారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోనూ ఇదే సమస్యపై అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అశ్వారావుపేట మండలం గాండ్లగూడెంలో ఏకంగా అధికారులనే అడ్డుకున్నారు. అనర్హులకు ఇండ్లు ఇచ్చే సర్వే వద్దంటూ సర్వేకు వచ్చిన అధికారులను పొలిమేర్ల నుంచే వెనక్కు పంపారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, పాత కార్డుల్లో పేర్లు ఎక్కించమంటే ఉన్న పేర్లను తొలగించారని ఆరోపిస్తూ అనేక గ్రామాల్లో ఆందోళనలు చేపట్టారు. దుమ్ముగూడెం మండల లబ్ధిదారుల పేర్లు వేరే జిల్లాలోని రేషన్ కార్డులో ఉన్నట్లు తేలడంతో వారు నెత్తీనోరూ బాదుకుంటున్నారు. ఇల్లెందు మండలం నెహ్రూనగర్‌లో తాగునీటి సమస్యపై రోడ్డెక్కినా అతీగతీలేదు. బిందెలు చేతపట్టుకొని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసినా కనీస స్పందన లేదు.

### ఇందిరమ్మ ఇండ్లపై నిలదీతలు..

ఏ గ్రామంలో చూసినా ఇందిరమ్మ ఇండ్ల ఆందోళనలే కన్పిస్తున్నాయి. ఎవరిని పలుకరించినా నిరుపేదలమైన తమకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదని గోడు వెళ్లబోసుకుంటుండడం గమనార్హం. భద్రాద్రి జిల్లాలోని 22 మండలాల్లో ఒక్కో మండలం నుంచి ఒక్కో పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఈ ఏడాది జనవరి 26నే మంజూరు పత్రాలు అందజేశారు. ఆ మంజూరు పత్రాలు అందుకున్న వారిలో అందరూ అనర్హులేనని అప్పట్లోనే అర్హులు ఆందోళనలు చేశారు. ఇప్పుడు ఆ పైలట్ గ్రామాలతోపాటు మిగతా గ్రామాల్లో కూడా మొదటి విడత కోసం అర్హుల విచారణ జరుగుతోంది. అయితే, ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన వారిలో ఏ ఒక్కరూ అర్హులు లేరని, అన్ని అర్హతలూ ఉన్న తమకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు సర్వే అధికారుల ఎదుట ప్రతి రోజూ ధర్నాలు చేస్తూనే ఉన్నారు.

### నాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు..

నాకు రేకుల ఇల్లు ఉంది. పెద్దగాలి వస్తే కూలిపోయే పరిస్థితి. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకున్నా. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం నాకు ఇల్లు మంజూరు చేయలేదు. కాంగ్రెస్ కార్యకర్తలకే ఇచ్చారు. పార్టీలో తిరిగే వాళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే మాలాంటి నిరుపేదల పరిస్థితి ఏమిటి?

**–మిరియాల లక్ష్మయ్య, అయ్యన్న పాలెం, చండ్రుగొండ**

### పింఛన్ రావడం లేదు..

నా భర్త చనిపోయి మూడేళ్లవుతోంది. పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. పెంచిన పింఛన్లు ఇస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రోజూ చెబుతోంది. కానీ.. ఇంత వరకూ ఇవ్వలేదు. కూలి పనులకు వెళ్లి బతుకు వెళ్లదీసుకునే నేను.. కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. పింఛన్ ఇవ్వకపోతే ఎలా బతకాలి?

**–దామర్ల పుల్లమ్మ, బుచ్చన్నగూడెం, అన్నపురెడ్డిపల్లి**

### ధర్నా చేసినా తాగునీరు ఇవ్వలేదు..

పథకాలే కాదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాకు తాగునీరు కూడా ఇవ్వలేకపోయింది. మాది నెహ్రూనగర్. మా గ్రామంలో తాగునీళ్లు లేకపోవడంతో చాలా దూరం వెళ్లి తెచ్చుకుంటున్నాం. మా గ్రామానికి తాగునీళ్లు ఇవ్వాలంటూ రోడ్డెక్కి రాస్తారోకో చేశాం. పైపులైన్లు వేసి నీళ్లు ఇస్తామని చెప్పారు కానీ ఈ రోజుకు కూడా ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేదు.

**–వీ.కౌసల్య, నెహ్రూనగర్, ఇల్లెందు**

# నేడు మిట్టపల్లికి యువనేత

- బీఆర్ఎస్ నేత 'రాయల' విగ్రహావిష్కరణలో పాల్గొననున్న కేటీఆర్
- మిట్టపల్లిలో విగ్రహావిష్కరణ సభ నిర్వహణకు నేతల ఏర్పాట్లు

ఖమ్మం, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్‌లో హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11:30 గంటలకు తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చేరుకుంటారు. మిట్టపల్లిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దివంగత రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించనున్నారు. అనంతరం మిట్టపల్లిలో జరిగే సభలో ప్రసంగించనున్నారు. తొలుత అంజనాపురం నుంచి మిట్టపల్లి సభా వేదిక వరకు బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. దివంగత రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేసేందుకు సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. సభ ఏర్పాట్లను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు గురువారం పరిశీలించారు. జిల్లాలో కేటీఆర్ పర్యటించనుండడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొననున్నది. మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, మదన్‌లాల్, చంద్రావతి, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తదితరులు పాల్గొననున్నారు.

## కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయండి

### ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా, మాజీ ఎమ్మెల్యే సండ్ర పిలుపు

ఖమ్మం/ సత్తుపల్లి, మే 8: తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో శుక్రవారం జరుగనున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలని, సభకు భారీగా తరలిరావాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. మిట్టపల్లి గ్రామంలో ఉదయం 10 గంటలకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావు విగ్రహావిష్కరణ అనంతరం జరిగే బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించనున్నట్లు తెలిపారు. తొలుత అంజనాపురం నుంచి కొత్త మిట్టపల్లి వరకు స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ ఉంటుందని, ఆ తర్వాత నిర్వహించనున్న సభకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు భారీగా తరలిరావాలని వారు కోరారు.

# సంప్రదింపుల్లేవు.. సమ్మతి అక్కర్లేదు..

## నిర్వాసితులతో మాట లేదు.. ముచ్చటా లేదు

- రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు ఇవ్వాల్సిందేనంటున్న ప్రభుత్వం
- మార్కింగ్ చేసి తొలగింపు పనుల కార్యాచరణలో రెవెన్యూ యంత్రాంగం
- బాధితులకు నోటీసులు ఇవ్వలేదు.. కనీసం సమావేశాలకూ పిలవలేదు..
- 'మున్నేరు'పై వాల్ నిర్మాణంలో కాంగ్రెస్ సర్కారు బలవంతపు చర్యలు!
- పనికిరానివంటూ పరీవాహక భూములను లాక్కునే ప్రయత్నం?
- భూములు, ప్లాట్లు, ఇళ్లు కోల్పోతున్న వందల మంది పేదలు
- చావనైనా చస్తాం గానీ భూములివ్వబోమంటున్న నిర్వాసితులు

**మున్నేరుపై రిటైనింగ్ వాల్ నిర్మాణంలో కాంగ్రెస్ సర్కారు బలవంతపు చర్యలకు దిగుతోంది. వాల్ నిర్మాణంలో ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులతో సంప్రదింపులు లేకుండానే, భూసేకరణకు వారి సమ్మతి అక్కర్లేకుండానే రేవంత్ సర్కారు ముందుకు సాగుతోంది. నిర్వాసితులతో సమావేశాలు పెట్టి మాట్లాడింది లేదు. ఫలానా పరిహారమిస్తామంటూ ముచ్చటించిందీ లేదు. పైగా భూములు ఇవ్వాల్సిందేనంటూ అధికారులతో హుకుంలు జారీ చేయిస్తోంది. బాధితులను గుర్తించి వారికి సలహాలివ్వడంగానీ, వారిని సమావేశాలకు పిలవడంగానీ చేయలేదు. వాల్ నిర్మించే ప్రాంతంలోని ఇళ్లను, భూములను గుర్తించడం, వాటిని తొలగించేందుకు మార్కింగ్ చేసుకుంటూ వెళ్లడం మినహా మరోమాట లేకుండా ముందుకు సాగుతోంది. దీంతో బాధితులందరూ లబోదిబోమంటున్నారు. -రఘునాథపాలెం, మే 8**

*రెక్కలు ముక్కలు చేసుకొని కూడబెట్టుకున్న కొద్దిపాటి ఆస్తి అయినా అది ఎంతో విలువైనది. తండ్రులు, తాతలు కూడా వారు పస్తులుండి మరీ కూడబెట్టిన తులమో, గజమో వారసత్వంగా తమ వారసులకు అందించి వెళ్తుంటారు. అది ఎన్నిరెట్లు విలువైనదైనప్పటికీ.. వారు దానిని తమ పూర్వీకుల జ్ఞాపకార్థంగా కాపాడుకుంటుంటారు. ఇంకొందరైతే.. తమ పిల్లల ఉన్నత చదువుల కోసం, వివాహాల కోసం, లేదంటే తమ కలల సాకారం కోసం ఒకపూట తిని, మరోపూట నీళ్లు తాగి పొలమో, జాగో పోగుచేసి ఉంటారు. కూడబెట్టుకున్న ఆ కొద్దిపాటి ఆస్తిపాస్తులపై ఎంతో అనుబంధాన్ని ఏర్పర్చుకుంటారు పేద, మధ్యతరగతి ప్రజలు. ఇంతలా మమకారాన్ని పెంచుకున్న వారి ఆస్తిపాస్తులను అగ్గువకు లాగేసుకునేందుకు ఎవరు ప్రయత్నించినా వారు ఆగ్రహానికి గురవుతారు. ఉగ్రరూపం దాల్చుతారు. ఖమ్మం మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములను తీసుకునే విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, అధికార యంత్రాంగం అనుసరిస్తున్న విధానాలపై ఆ పేద, మధ్య తరగతి ప్రజలు భగ్గుమంటున్నారు. పరిహారం ఎంతన్న విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని, తామిచ్చిందే పరిహారమన్నట్లుగా వ్యవహరిస్తోందని, రెవెన్యూ అధికారులేమో వాస్తవ పరిస్థితిని కలెక్టర్‌కు, ప్రభుత్వానికి చెప్పడం లేదని, ఇష్టమున్నా లేకున్నా ఇచ్చిన మొత్తాన్నే తీసుకోవాలంటున్నారని, అలా అయితే తాము కడుపు మాడ్చుకొని కూడబెట్టుకున్న ఆస్తిపాస్తులను కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*

ఖమ్మం మున్నేటి పరిసరాల్లో ఉన్న ఇళ్లకు అధికారులు చేసిన మార్కింగ్‌లు

ఏటా మున్నేటి ఉధృతికి దాని పరీవాహక ప్రాంతాలన్నీ జలమయమవుతున్నాయి. రెండేళ్ల క్రితం వరదలు కూడా విలతాండవం చేయడంతో అప్పటి కేసీఆర్ సర్కారు మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ ఏడాది వర్షాకాలంలో మళ్లీ మున్నేరు మహోగ్ర రూపం దాల్చి పరీవాహక ప్రాంతాలను ముంచెత్తడంతో అక్కడి ప్రజలందరూ కట్టుబట్టలతో బయటపడ్డారు. ఆస్తులు, ఇళ్లు కోల్పోయారు. ఈ క్రమంలో గత కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు మొదలుపెట్టిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. భూసేకరణ విషయంలో పేదలు, మధ్య ప్రజలకు అన్యాయం చేస్తోంది. వాల్ నిర్మాణం కోసం విలువైన భూములు తీసుకుంటూ మార్కింగ్‌లు పెడుతూ ముందుకెళ్తున్న ప్రభుత్వం.. అందుకు ఇచ్చే పరిహారం ఇప్పటికీ స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో ఆయా భూములు, ప్లాట్లు కోల్పోతున్న నిర్వాసితులు లబోదిబోమంటున్నారు.

ఖమ్మంలో మున్నేరుకు రెండు వైపులా సుమారు 17.50 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం పనులను కొనసాగిస్తోంది. తొలుత ప్రభుత్వ భూములున్న ప్రాంతాల్లో అధికారులు పనులు చేపడుతున్నారు. కాగా, వాల్ నిర్మాణంలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు భూములు, ప్రైవేటు ప్లాట్లు, ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి. 50 ఎకరాల మేరకు ప్రైవేటు భూములు, స్థలాలను తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ప్రైవేటు ప్లాట్లు కలిగిన వాళ్లు, ఇళ్లు కట్టుకున్న వాళ్లు 250 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. అయితే భూములు, ప్లాట్ల నిర్వాసితులను గుర్తించిన అధికారులు.. వారికిచ్చే పరిహారంపై నేటికీ స్పష్టత ఇవ్వలేదు. నిర్వాసితులు అడిగినా అధికారులు ఖాతరు చేయడం లేదు. అయితే.. రిటైనింగ్ వాల్, కల్వర్టు, బఫర్ జోన్ పేరుతో తమ భూములను లాక్కుంటున్నారని, ప్రజా అవసరాల దృష్ట్యా ప్రభుత్వం చేపట్టే అభివృద్ధికి కార్యక్రమాలకు సహకరించినా, సహకరించకపోయినా భూములను తప్పక తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారని నిర్వాసితులు తలలు బాదుకుంటున్నారు. మున్నేరుకు ఆనుకొని ఎకరం విలువ రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లపైగానే మార్కెట్లో ఉన్నందున ఆ ప్రకారంగానే తమ భూములకు, ప్లాట్లకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. లేకుంటే స్థలాలు ఇవ్వబోమని స్పష్టం చేస్తున్నారు.

**చావనైనా చస్తాం గానీ భూములివ్వం..**

చావనైనా చస్తాం గానీ పరిహారం చెల్లించకుంటే భూములివ్వబోమని నిర్వాసితులు అధికారులకు తేల్చిచెప్పారు. 'మా కుటుంబాలను వీధిన పడేస్తారా?' అంటూ ప్రశ్నించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ బలవంతంగా లాక్కుంటే తామూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఎక్కడో ఓ చోట విలువైన భూములిస్తామంటే అంగీకరించబోమని అన్నారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తేల్చిచెప్పారు. అయితే, ఇప్పటికే కొందరు ప్లాట్ల యజమానులు స్టే తెచ్చుకున్నట్లు తెలిసింది.

**పోలేపల్లిలో ప్లాట్లిస్తామంటున్న అధికారులు**

రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ప్లాట్లు, ఇండ్లు, భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో ప్లాట్లు ఇస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే, విలువైన తమ భూములు తీసుకుంటూ అంతగా విలువ చేయని ఆ భూములను తమకెలా ఇస్తారని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు.

### మూడింతల పరిహారమిస్తేనే..

ప్రకాశ్‌నగర్‌లో మా తాతయ్య ద్వారా వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములను సాగు చేసుకుంటూ ఎన్నో ఏళ్లుగా బతుకుతున్నాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మిస్తూ మా భూములు తీసుకుంటోంది. రెవెన్యూ అధికారులు వచ్చి మా భూమిలో మార్కింగ్ చేశారు. ఇక్కడున్న మార్కెట్ విలువకు మూడింతల పరిహారం చెల్లిస్తేనే భూములిస్తాం. లేదంటే హైకోర్టును ఆశ్రయిస్తాం.

**–ఆకిటి నవీన్, నిర్వాసితుడు, ప్రకాశ్‌నగర్**

# ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

### సీపీఎం ఆధ్వర్యంలో పాల్వంచ మండల పరిషత్ ఎదుట ధర్నా

పాల్వంచ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పాల్వంచ రూరల్, మే 8 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, మండలంలో నెలకొన్న అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పాల్వంచ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించిన ఆ పార్టీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పలువురు మాట్లాడుతూ మండలంలో అర్హులైన నిరుపేదలందరికీ స్థలాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో కొందరు అధికార పార్టీ నాయకులు వారి పార్టీ కార్యకర్తలకే ఇండ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. నిరుపేదలకు కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, బండ్రిగొండలో ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పట్టాలిచ్చిన భూములకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అన్నవరపు సత్యనారాయణ, కొండబోయిన వెంకటేశ్వర్లు, వెంకట్రావు, అన్నవరపు కనకయ్య పాల్గొన్నారు.

# ముంచే వాన మళ్లొచ్చింది..

- ఈదురుగాలులతో కూడిన వర్షంతో రైతుల అవస్థలు
- పలు కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యపు రాసులు
- ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల పాట్లు

కొత్తగూడెంలో కురిసిన వర్షానికి తడిసిన ధాన్యపు రాసులు

భద్రాద్రి కొత్తగూడెం(నమస్తే తెలంగాణ)/అన్నపురెడ్డిపల్లి/ బూర్గంపాడు/భద్రాచలం, మే 8 : అకాల వర్షాలు రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న, కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాతావరణంలో నెలకొన్న విభిన్న పరిస్థితులతో ఎప్పుడు ఎండగా ఉంటుందో.. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియక రైతులు సతమతమవుతున్నారు. భద్రాద్రి జిల్లాలోని పలు మండలాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో అకాల వర్షం కురవడంతో అన్నదాతలు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా పాట్లు పడ్డారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యపు రాసులు తడిచిముద్దయ్యాయి. కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, పాల్వంచ, సుజాతనగర్, చుంద్రుగొండ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. సుజాతనగర్ మండలంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాసులపై కప్పుకోవడానికి టార్పాలిన్లు లేకపోవడంతో తడిచిముద్దయ్యాయి. అన్నపురెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాసులను వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను చూసి ఉరుకులు పరుగులతో వెళ్లి టార్పాలిన్లు తెచ్చి ధాన్యపు రాసులపై కప్పుకున్నారు. వర్షం తగ్గిన తర్వాత టార్పాలిన్లపై, ధాన్యపు రాసుల చుట్టూ చేరిన నీటిని తొలగించుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరారు. బూర్గంపాడు మండలంలో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. పొలాల్లో ఉన్న చెట్టుపై పిడుగుపడడంతో అగ్నికి ఆహుతైంది. భద్రాచలం పట్టణంలో భారీ వర్షంతోపాటు పిడుగు పడింది. రాజరాజేశ్వరస్వామి ఆలయం సమీపంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో పూర్తిగా దగ్ధమైంది. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

అన్నపురెడ్డిపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రంలో పరదాలపై నీటిని తొలగిస్తున్న రైతు

భద్రాచలంలో పిడుగుపాటుకు మండుతున్న కొబ్బరి చెట్టు